వినతులు స్వీకరిస్తున్న జెసి డాక్టర్ బి.నవ్య

50 శాతం రాయితీని పునరుద్ధరించాలి

• పిపిఎస్ఎస్, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా • స్టేషన్ మాస్టర్ నాగరాజుకు వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వృద్ధులకు, విలేకరులకు, కళాకారులకు రైల్వే ఛార్జీలో గతంలో ఇస్తున్న 50శాతం రాయితీని పునరుద్ధరించాలని, వికలాంగులకు, జబ్బు పడ్డవారికి తమతో పాటు మరొక సహాయ కారికి ఉచిత ప్రయాణం కల్పించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, రిటైర్డ్ లెక్చరర్ ఎస్ సర్ఫుద్దీన్, బిఎస్ఎన్ఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.మహేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు గోరంట్లప్ప, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి టి.మద్దిలేటి, రైల్వే శాఖను కోరారు. సోమవారం రైల్వే స్టేషన్ ఎదుట బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యాకోబ్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగు, పత్రికా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ కాలనీలా అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు రవాణా ప్రయాణం ఖర్చుతో పాటు శ్రమతో కూడుకున్నదని, రైల్వే ప్రయాణం సులభంగా ఉంటుందన్నారు. 60 ఏళ్ల నిండిన వృద్ధులు ఇతరులపై ఆధారపడకుండా 50 శాతం ఛార్జీతో బంధుమిత్రుల దగ్గరికి వెళ్లేవారు. విలేకరులు పలు ప్రాంతాల్లో తిరిగి వ్యవస్థలో ఉండే లోపాలు, ప్రజల సమస్యలను సేకరించి ప్రభుత్వానికి ప్రజల దృష్టికి తెచ్చేవారన్నారు. కళాకారులు వివిధ ప్రాంతాల్లో శిక్షణ పొందడం, ఉచిత ప్రదర్శనలు ఇచ్చేవారని అన్నారు. అనారోగ్యంతో ఉన్నవారు దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేసుకునే వారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం కరోనా సమయంలో రైల్వేఛార్జీలో ఇస్తున్న రాయితీలను రద్దు చేసి వృద్ధులకు, వికలాంగులకు, జర్నలిస్టులకు , కళాకారులకు ,జబ్బు పడ్డ వారికి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అదానీ,అంబానీలాంటి బహుళజాతి సంస్థలకు రూ.15 లక్షల కోట్ల బ్యాంకు రుణాలు రద్దు చేయడంతో పాటు అనేక రాయితీలు ఇస్తున్న బిజెపి ప్రభుత్వానికి వృద్ధులు, వికలాంగులు, జర్నలిస్టులు, కళాకారులు, జబ్బు పడ్డవారికి ఇచ్చే రాయితీలు బరువయ్యాయా? అని ప్రశ్నించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా గతంలో ఇచ్చిన రైల్వే ఛార్జీలో రాయతీలన్నీ పునరుద్ధరించడంతో పాటు వికలాంగులకు, జబ్బున పడ్డ వారికి వారితో పాటు వారి వెంట మరొకరికి ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. ధర్నా అనంతరం రైల్వే స్టేషన్ మాస్టర్ నాగరాజుకు వినతిపత్రం ఇచ్చారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ శాఖల పెన్షనర్స్ మద్దిలేటి, చంద్రశేఖర్, పాపయ్య, బి.నాగేంద్ర, రిటైర్డ్ డిఎస్పి పాపారావు, గోపీనాథ్, వెంకటనర్సు, పీటర్, పత్రికారంగం నుండి యూసఫ్ ఖాన్, అంజి, వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, ఉస్మాన్ బాష, యూనుస్, వర్మ, రమణ గౌడ్, చిన్నబాష, సర్దార్, శంకర్ రెడ్డి, అన్వర్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న పిపిఎస్ఎస్ నాయకులు పుల్లారెడ్డి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గ్రీవెన్స్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జెసి డాక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు.. రెవెన్యూ గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులు రీఓపెన్ అయిన వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 22ఎ గ్రీవెన్సులు జిల్లాలో సుమారు 326 ఓపెన్ అయ్యాయన్నారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో పరిష్కారం చేసిన అర్జీలను ఆడిట్ చేయడానికి ఆప్షన్ ఎనేబుల్ చేశామన్నారు. డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కొండయ్య పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌పై క్రిమినల్ కేసులు పెట్టాలి

- జెసికి ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆయుష్మాన్ నర్సింగ్ కాలేజ్ యాజమాన్యం పైన క్రిమినల్ కేసులు పెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. సోమవారం జెసి డాక్టర్ నవ్యకు ఎస్ఎఫ్ఐ జిల్లా తరపున వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కర్నూలు నగరంలోని సోమిశెటి నగర్‌లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒకే భవనంలో ఆయుష్మాన్, మదర్ తెరిసా నర్సింగ్ కళాశాలలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రయోగశాలలు, ప్రదర్శన గదులు, లైబ్రరి సరైన మౌలిక వసతులతో కూడిన హాస్టల్ లేకపోయినా విద్యార్థుల దగ్గర నుండి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు కంటే అధికంగా వసూలు చేస్తూన్నారన్నారు. తాజుద్దీన్ అనే విద్యార్థి 2022-23 సంవత్సరంలో కన్వీనర్ కోటాలో చేరారని ఫీజు చెల్లించలేదని ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్‌కు అనుమతించలేదన్నారు. పరీక్షల కూడా రాయనివ్వకుండా సంవత్సరం పాటు కళాశాలలోకి అనుమతించకుండా విద్యార్థినిపట్ల క్రూరంగా వ్యవహరించారన్నారు. గ్రామీణ ప్రాంతాల నుండి కష్టపడి మంచిర్యాంకు ద్వారా కన్వీనింగ్ కోటాలో సీట్లు తెచ్చుకొని నాణ్యమైన విద్యకోసం కళాశాలకు వస్తున్న విద్యార్థులను మోసం చేస్తురన్నారు. తప్పుడు ప్రమాణాలతో అనుమతులు పొంది కళాశాలను నిర్వహిస్తున్నారన్నారు. కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నగర నాయకులు అబుబక్కర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆహారమే ఔషధం

• సదస్సులో ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ శంకర్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మారిన జీవనశైలిలో ఆహారాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడంలేదని, అందువల్లనే మందులపై పూర్తిగా అధారపడుతున్నారని ,అనేక రోగాలకు మూల కారణం ఆహారం కూడా అని దానికి ఔషధం కూడా జీవనశైలి, ఆహారాన్ని బట్టే ఉంటుందని గుంటూరు మెడికల్ కాలేజీ ఫార్మసి విభాగాధిపతి డాక్టర్ శంకర్ అన్నారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన "జీవనశైలి మార్పులు-తక్కువ కార్బోహైడ్రేట్స్ , ఎక్కువ ఆరోగ్యకర కొవ్వులు, ఇంటర్మీడియట్ ఫాస్టింగ్" అన్న అంశం పై సెమినార్ నిర్వహించారు. ప్రొఫెసర్ శంకర్ మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారం అనేక రోగాలకు మూల కారణం అవుతుందన్నారు. ఆహారంలో మార్పులు చేసుకోవడం, జీవనశైలిలో మార్పులు చేయడం ద్వారా వాటిని సమర్థవంతంగా నివారించుకోవచ్చని తెలిపారు. తీసుకునే ఆహార విషయంలో అనేక అపోహలు ఆశాస్త్రీయ అంశాలు కొనసాగుతున్నాయన్నారు. కార్బోహైడ్రేట్స్ తగ్గించాలని, కోడిగుడ్డును పచ్చసొనతో సహా తీసుకోవాలన్నారు. అయిల్స్‌లో ఉన్న వాటిలో కోకనట్ అయిల్ మంచిదని వెన్న , నెయ్యి మంచిదన్నారు. మిల్లెట్ డైట్ రోగాలకి వైద్యం కాదని ముందు జాగ్రత్త చర్యలు కోసం మాత్రమే ఉపయోగపడుతుందని తెలిపారు. ఉపవాసం విషయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితం ప్రజలు ఆహారానికి తక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇది మంచి పద్ధతి కాదని, రోగాల విషయంలో ఆహారందే ప్రముఖ పాత్ర అని అన్నారు. ఆహార విషయంలో శాస్త్రీయంగా నిరూపణ అయిన విధానాలే పాటించాలని తెలిపారు. ఫార్మకాలజీ, కమ్యూనిటీ మెడిషన్, న్యూరాలజి విభాగాదిపతులు డాక్టర్ రాజేష్, డాక్టర్ సుధా కుమారి, డాక్టర్ శ్రీనివాసులు, క్యాన్సర్ ఇనిస్టిట్యూ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్, డాక్టర్ దామం శ్రీనివాసులు, వివిధ విభాగాల అధిపతులు అసోసియేట్లు అసిస్టెంట్లు, పిజిలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ

వేగంగా విచారించి పరిష్కారం

• పోలీసు గ్రీవెన్స్‌కు 93 ఫిర్యాదులు ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ పోలీసు అధికారులను ఆదేశించారు. కర్నూలు, కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో ఆయన సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతా ల నుండి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఫిర్యాది దారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 93 ఫిర్యాదులు వచ్చాయి.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

బెంగుళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 3 లక్షలు తీసుకొని బెంగుళూరు కు చెందిన మనీషా జాబ్ కన్సల్టెన్సీ పేరుతో మోసం చేసిందని కర్నూలు ఎన్ఆర్‌పేటకు చెందిన సమీర్ ఫిర్యాదు చేశారు. నా కుమారుడు రాజు ప్రతిరోజు మద్యం సేవించి వచ్చి డబ్బులు ఇవ్వాలంటూ నానా రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు , మద్దూర్‌నగర్‌కు చెందిన అన్నమ్మ ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లో గుడ్‌క్రాప్ ఐటి సోల్యూషన్స్ ప్రవేట్ లిమిటెడ్‌కు చెందిన చంద్రశేఖర్ నాయుడు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ. 2 లక్షల 60 వేలు తీసుకొని, 3 నెలల పాటు పని చేయుంచుకుని జీతాలు ఇవ్వకుండా, ఉద్యోగాలు ఇప్పించకుండా మోసం చేశాడని కర్నూలు, పార్వతి నగర్ కు చెందిన కుర్వ ఆంజనేయులు, ఈశ్వర్ చందు ఫిర్యాదు చేశారు. టెలి గ్రామ్ యాప్‌లో వచ్చిన ట్రేడింగ్ లింక్‌ను క్లిక్ చేసి చిన్న మొత్తాలు డిపాజిట్ చేశానని, లాభాలు వస్తున్నాయనే నమ్మకంతో పెద్ద మొత్తాలలో డిపాజిట్ చేసినప్పుడు డబ్బులు తిరిగి రాలేదని రూ. 61,600 సైబర్ నేరగాళ్ళ చేతిలో మోసపోయానని రికవరీ చేయించాలని కర్నూలు ఎల్.వెంకయ్యనగర్‌కు చెందిన విశ్వకార్తీక్ ఫిర్యాదు చేశారు. తెలియని వ్యక్తులు నా అన్న పై దాడి చేయడంతో పాటు ఇంటికి వచ్చి దుర్భాషలాడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కర్నూలు, ఎన్టీఆర్ బిల్డింగ్స్, రాములవారి వీధికి చెందిన భవాని ఫిర్యాదు చేశారు. నాపొలం ప్రక్కన ఉన్న గఫూర్ అతని పొలంలోని ఎక్కువగా ఉన్న నీళ్ళను నా పొలంలోకి వదిలి పంట నష్టం చేస్తున్నాడని వృధా అవుతున్న నీళ్ళకు అడ్డుకట్ట వేయకుండా నాపై బెదిరింపులకు పాల్పడుతున్నాడని ప్యాలకుర్తికి చెందిన ఖాజా బందే నవాజ్ ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్‌పి హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐ శివశంకర్ పాల్గొన్నారు.

బాధితునితో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

వినతులను స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ

సమస్యలకు సత్వర పరిష్కారం

-నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ

-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 15 అర్జీలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో వివిధ కాలనీలకు సంబంధించి ప్రజలు తెలుపుతున్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జివి.క్రిష్ణ అన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 15 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అదనపు కమిషనర్ ప్రజలకు తెలిపారు. మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఆరోగ్యధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్‌రెడ్డి, సిటీప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎస్ఇ రాజశేఖర్, ఆర్ఓ జునైద్, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

సి బెళగల్ స్పందనకు 4 వినతులు

ప్రజాశక్తి- సి బెళగల్ : సి బెళగల్ లో సోమవారం జరిగిన స్పందనకు నాలుగు వినతులు వచ్చాయని ఇంచార్జి తహసీల్దార్ పురుషోత్తం పేర్కొన్నారు. భూములు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇద్దరు రైతులు, కొలతలు తక్కువగా ఉన్నాయని ఒక రైతు దరఖాస్తు చేసుకొన్నారని అన్నారు. అలాగే ప్రతి సోమవారం స్పందనలో వచ్చే వినతికి తప్పనిసరిగా న్యాయం చేస్తామని ఆయన ఈ సందర్భంగా అన్నారు.ప్రతి సోమవారం స్పందనను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం

కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు , సర్పంచి భాగ్యరత్న

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

కోడుమూరు పట్టణంలో రీచ్ చౌడేశ్వరిదేవి అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్ఆర్‌డి మైదానంలో కోడుమూరు ఎస్ఐ ఎపి శ్రీనివాసులు ,సర్పంచి భాగ్యరత్న ప్రారంభించారు. విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించాలని వారన్నారు. క్రికెట్ పోటీలను నిర్వాహకులు దస్తగిరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.50,000, రెండో బహుమతిగా రూ.25000 అందజేస్తామన్నారు.

పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలి

-ఇంటి నిర్మాణానికి రూ 5 లక్షలు ఇవ్వాలి

-ముజఫర్ నగర్ సచివాలయం వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్

పట్టణ ప్రాంతాల్లోని పేదలకు రెండు సెంట్లు స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ ఐదు లక్షలు ఇవ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ముజఫర్ నగర్ 81, 82వ సచివాలయం దగ్గర ధర్నా జి ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయిబాబా, కె సుధాకరప్ప, కె.ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా ఎం.ఎ. గఫూర్ ఉన్నప్పుడు జగన్నాథం గట్టు, పందిపాడు స్థలాల్లో దాదాపు 25 వేల మందికి ఇల్లు ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు కల్లబొల్లి మాటలు చెబుతూ పేదల సొంత ఇంటి కలను నెరవేరుస్తామని చెప్పి ఎన్నికల అనంతరం చేసిన వాగ్దానాలను మరిచిపోతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టణ ప్రాంతంలోని పేదలకు రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతంలోని పేదలకు మూడు సెంట్లు స్థలం ఇస్తామని ప్రకటన చేశారని తెలిపారు. ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే పట్టణ ప్రాంతంలో నివసించే వారికి నగరానికి చుట్టుపక్కల 2 సెంట్లు స్థలం, రూ ఐదు లక్షల రుణం ఇచ్చి ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. పేదలకు ఇళ్ల స్థలాలు వచ్చేవరకు పోరాటం చేస్తామని, అవసరమైతే సిపిఎం పూనుకొని ప్రభుత్వం ఇవ్వని పక్షంలో భూ పోరాటాలు నిర్వహించి పేదలకు స్థలాలు పంపిణీ చేస్తామని హెచ్చరించారు. సచివాలయం అడ్మిన్, విఆర్ఓలకు దరఖాస్తు లను అందజేశారు. అడ్మిన్, విఆర్ఓ మాట్లాడుతూ సర్వే నిర్వహించి అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు యంసి ఆనంద్, ఎస్. షంషీర్, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: కూటమి ప్రభుత్వం అధికారంలో అధికారంలోకి వచ్చి ఇండ్ల స్థలాలను ప్రకటించిందని వెంటనే ప్రకటించిన పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి రుణాలు ఐదు లక్షల ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో శరీన్ నగర్ 30 వార్డు 77 సచివాలయంలో అర్జీలు సచివాలయం అధికారి బి ప్రవళిక గారికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు జి ఏసు, పి మధు, కె.మహబూబ్, పి హుస్సేన్, ఇ. లక్ష్మీదేవి తదిరులు అర్జీలు అందజేశారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సుధాకరప్ప

కూటమి నాయకులను నిలదీయండి: సిపిఎం

కేంద్ర బడ్జెట్ లో ఎపి అన్యాయం

ప్రజాశక్తి-పత్తికొండ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎపికి నిధులు కేటాయించకుండా మొండి చేయి చూపిందని సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఈశ్వర్ రెడ్డి భవన్ నుండి నాలుగు స్తంభాల కూడలి వరకు సిపిఎం నాయకులు కేంద్ర బడ్జెట్ లో ఎపికి తీవ్ర అన్యాయమనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు పి.కాశీ అధ్యక్షతన సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎపికి అన్యాయం చేస్తూ కార్పొరేట్లకు ప్రయోజనకరంగా బడ్జెట్ ఉందన్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రను ఆదుకోవడానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని, రాజధాని అమరావతి కడప ఉక్కు విశాఖ స్టీల్ బడ్జెట్లో నిధుల ఊసే లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర గురించి ఉసేలేదని, కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెట్ అని ,సంపన్నులకు ఊడిగం చేసే బడ్జెట్ అని విమర్శించారు. సిపిఎం మండల కమిటీ నాయకుడు గంగన్న, ప్రజా నాట్యమండలి కార్యదర్శి రమేష్ , వెంకటేష్ పాల్గొన్నారు..

క్రెడో స్కూల్‌లో రోడ్డు భద్రత పై అవగాహన

- ఎంవిఐ కె.రవీంద్ర కుమార్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం బి తాండ్రపాడు క్రెడో స్కూల్లో 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల కార్యక్రమాలు 19వ రోజు కొనసాగుతున్నాయి. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎస్.శాంత కుమారి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె రవీంద్ర కుమార్ పర్యవేక్షణలో రోడ్డు భద్రత సదస్సు కొనసాగింది. క్రెడో స్కూలులో రోడ్డు భద్రతపై క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. స్కూల్ బస్‌డ్రైవర్లు, క్లీనర్లు, విద్యార్థులు పాఠశాల సిబ్బంది హాజరయ్యారు. స్కూల్ పిల్లల బస్ డ్రైవర్ల క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. విద్యార్థులను ఇంటి నుండి పాఠశాలకు పాఠశాల నుండి నివాసానికి తీసుకెళ్లడానికి భద్రతను గూర్చి సూచనలు చేవారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎం.వి.సుధాకర్ రెడ్డి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బాబు కిషోర్ లు మాట్లాడుతూ మోటార్ సైకిల్ నడుపుతున్నప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. రాష్ డ్రైవింగ్, అధిక వేగం అత్యంత ప్రమాదకరమన్నారు. వాహన దారులు మత్తు పదార్థాలు, మద్యం సేవించి వాహనం నడపకూడదన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. కారులో ప్రయాణిస్తున్నప్పుడు సీట్ బెల్ట్‌ను ధరించడం, దాని ప్రాముఖ్యత గురించి వివరించారు. ట్రాన్స్‌ర్ట్ హెడ్ కానిస్టేబుళ్లు చలపతి, వి.విజయ భాస్కర్, హోమ్ గార్డ్సు, క్రెడో స్కూల్ విద్యార్థులు, యజమాన్యం, తదితరులు పాల్గొన్నారు

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

కంది కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే గౌరు చరిత

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రైతులను అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డి అన్నారు. సోమవారం ఓర్వకల్లు మండల కేంద్రంలో మార్క్‌ఫెడ్ , నాఫెడ్ ఆధ్వర్యంలో కంది కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా రైతులు పండించిన కందిని క్వింటాలుకు రూ.7550 మద్దతు ధర కల్పించినట్లు పేర్కొన్నారు. రైతుల బాగోగులకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతుల సంక్షేమానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అభిప్రాయం వ్యక్తం చేశారు. కంది రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించామన్నారు. డిసిఒ జాఫ్రీన్, ఎంపిడిఒ శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నంద్యాల పార్లమెంటు ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, మండల నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, సుధాకరయ్యా, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న హనుమంతరావు

చదువు మనిషి జీవితాన్నే మార్చేస్తుంది

- హనుమంతరావు

ప్రజాశక్తి -మద్దికేర :చదువు మనిషి జీవితాన్ని మార్చేస్తుందని శారద హనుమంతరావు దంపతులు తెలిపారు. పెరవలి గ్రామం జడ్‌పిహెచ్ పాఠశాల నిలయమైన సరస్వతి దేవి ఆలయ 5వ వార్షికోత్సవం లో భాగంగా వసంత పంచమి రోజున వారి ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఉదయం మహాగణపతి పూజ అనంతరం సరస్వతి దేవికి అభిషేకం నిర్వహించారు. వేద పండితుల సమక్షంలో గ్రామ పెద్దలు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి మనిషి ఎదుగుదలకు చదువు ఎంతగానో దోహదపడుతుందన్నారు. చదువు ఆవశ్యకతను తెలియజేయాలనే తన స్వగ్రామైన పెరవలి జడ్పీ పాఠశాలలో సరస్వతి విగ్రహాన్ని ప్రతిష్టించానన్నారు. సరస్వతి దేవి ప్రతిష్టార్పణతో విద్యార్థులలో చదువు యొక్క ప్రేరణ పెరుగుతుందన్నారు. ప్రతి తల్లిదండ్రులు పిల్లలను తప్పక చదివించాలన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శ్రీవిద్య సాయి స్కూల్ : మద్దికేర శ్రీ విద్యా సాయి స్కూల్ కూడా కరస్పాండెంట్ వెంకట మాధవ్ ఆధ్వర్యంలో వసంత పంచమి ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిందన్నారు. పిల్లలు చేసిన సాంతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఘనంగా విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన

- వేడుకలకు ఎమ్మెల్యే బీవీ హాజరు



ఎమ్మెల్యే బీవీని సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలం ముగతి గ్రామంలో శ్రీజంబులా పరమేశ్వరి దేవి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన వేడుకలు సోమవారం ఆలయ ధర్మకర్త ముగతి ఈరన్న గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు, ఆడపడుచులు, మండల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. గ్రామానికి విచ్చేసిన భక్తులకు ఆలయ ధర్మకర్త అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ వేడుకలో ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఈరన్నగౌడ్, భార్గవ్ యాదవ్, సంజీవరాయలు గౌడ్ శాలువా, పూలమాల వేసి సన్మానించారు. అమ్మవారి దేవాలయాన్ని నిర్మించి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్టాపన పూర్తి చేసినందుకు ఎమ్మెల్యే అభినందించారు. టిడిపి సీనియర్ నాయకులు మాధవరావు దేశాయ్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఎంపిడిఒ పుల్లయ్య, ఇఒఆర్‌డి సందీప్, వివిధ శాఖల అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఆరాధనలు, నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి నాయకులు ఖాసీం వలీ, రైస్‌మిల్ నారాయణరెడ్డి, ధర్మపురం గోపాల్, సోమలగూడూరు వెంకటరామరెడ్డి, సత్యా రెడ్డి, నాగలదిన్నె ఉరుకుంద, బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల మూసివేత తగదు

- యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు దావీదు

మాట్లాడుతున్న దావీదు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు/నందవరం

జిఒ 117ను రద్దు చేస్తున్నామని చెప్పి.. ఆ పేరుతో ప్రాథమిక పాఠశాలను మూసివేయడం తగదని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు దావీదు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జె.ఎల్లప్ప పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రాంతీయ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఎన్.నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిఒ 117ను రద్దు చేస్తూ ఇచ్చిన మెమోలో 60కి పైగా విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మారుస్తామని చెప్పి ఇప్పుడు పంచాయతీకి ఒకటే మోడల్ ప్రైమరీ పాఠశాలలు చేస్తామని.. మిగిలిన పాఠశాలను బేసిక్ ప్రైమరీ పాఠశాలగా మారుస్తామని చెప్పడంతో ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. దీనివల్ల 10 వేలు ఉన్న ఏకోపాధ్యాయ పాఠశాలలు 20 వేలకు పెరిగే అవకాశం ఉందని చెప్పారు. 60కి పైగా విద్యార్థులున్న పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చాలని డిమాండ్ చేశారు. అలాగే 60కి పైగా విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పి ప్రస్తుతం వీటిని డీగ్రేడ్ చేసి అక్కడ ఉండే విద్యార్థులను 3, 5 కిలోమీటర్ల దూరంలో ఉండే ఉన్నత పాఠశాలకు వెళ్లి చదవాలని చెప్పడం దుర్మార్గమని తెలిపారు. 30కి పైగా విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించి ఆ పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ నాయకులు దేవపాల్, నరసింహులు, వీరభద్రయ్య, కె.రాజు, ఇస్సాక్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం : సిపిఎం

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, కర్నూలు జిల్లాకు కేంద్రం మొండి చేయి చూపిందని సిపిఎం మండల కమిటీ సభ్యులు అశోక్ విమర్శించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు యూసుఫ్ బాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. గత 11 ఏళ్లుగా రాష్ట్రానికి ఇదే అన్యాయం, ద్రోహం చేస్తూ ఉందని తెలిపారు. గతంలో వైసిపి ప్రభుత్వంలోనూ, డబుల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పుకునే కూటమి ప్రభుత్వంలోనూ రాష్ట్రానికి అన్యాయమే జరుగుతోందని పేర్కొన్నారు. ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి భారీ విజయం ఇచ్చిన తెలుగు ప్రజలను కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. సిపిఎం సభ్యులు రమేష్, బలరాముడు, బండ్లయ్య, కుమార్, మహేష్, రంగడు, రాముడు పాల్గొన్నారు.

కనుల పండువగా కుంభాభిషేకం

- హెలికాప్టర్ ద్వారా పూల వర్షం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి మహా కుంభాభిషేకం సోమవారం కనుల పండువగా సాగింది. పుణ్యక్షేత్రంలో కలశ ప్రతిష్టాపన, విజయ గణపతి, శ్రీలక్ష్మి అమ్మవారు, నవగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్టాపన కోసం మూడు రోజుల నుంచి హోమాలు, యాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారుల హడావిడి, సాంస్కృతిక కార్యక్రమాలతో కుంభాభిషేకం వైభవంగా జరిగింది.

పీఠాధిపతులతో ప్రాణ ప్రతిష్ట : శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో నాలుగు గోపురాలకు కలశ (ఒక్కో గోపురానికి ఐదు), రాజ గోపురానికి కలశాలు, ప్రత్యేక పూజలతో ప్రతిష్టాపన చేశారు. విజయ గణపతి, శ్రీలక్ష్మి అమ్మవారు, నవగ్రహాలకు, ధ్వజస్తంభానికి పుష్పగిరి మఠం పీఠాధిపతులు శ్రీశంకరాచార్య, శ్రీవిద్యానరసింహ భారతి స్వామి, శ్రీశైలం మఠం పీఠాధిపతులు శ్రీచెన్న సిద్ధ రామ శివచార్యులు, మంత్రాలయం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు, హల్వి మఠం పీఠాధిపతులు మాంతేశ్వర స్వామి భక్తుల సమక్షంలో ప్రాణ ప్రతిష్ట చేశారు. పీఠాధిపతులకు డిప్యూటీ కమిషనర్ విజయ రాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. 12 ఏళ్లకోసారి జరిగే మహా కుంభాభిషేక మహోత్సవాన్ని చూసి భక్తులు పరవశించిపోయారు.

రాజకీయ సందడి: శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి కుంభాభిషేకంలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంతో రాజకీయ సందడి నెలకొంది. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి, వైసిపి నాయకులు వై.ప్రదీప్ రెడ్డి, దేశాయి ప్రహ్లాద చారి, నాగరాజు గౌడ్, రామన్న గౌడ్ పాల్గొని పూజలు చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కా రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాం బాబు, ఎమ్మెల్సీ బిటి.నాయుడు, టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఉల్లిగయ్య, ముత్తు రెడ్డి, సురేష్ నాయుడు, టిప్పు సుల్తాన్, వెంకటపతి రాజు, అడివప్ప గౌడ్, చెన్న బసప్ప, కొట్రేష్ గౌడ్, కురుగోడు, మహాదేవ వేర్వేరుగా దర్శించుకుని పూజలు చేశారు.

కిలో బంగారు విగ్రహం విరాళం : మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి వారి తల్లి లలితమ్మ జ్ఞాపకార్థం కిలో బంగారుతో చేయించిన నరసింహ స్వామి విగ్రహాన్ని అందజేశారు. వారు కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. వారికి దేవాలయ అధికారులు పూలమాల, శాలువా వేసి సన్మానించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు : కుంభాభిషేకం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. భరతనాట్యం, పౌరాణికం, భక్తి గీతాలు, నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ కార్యక్రమాలు చేపట్టడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు

గ్రామాల్లో పండగ వాతావరణం : కుంభాభిషేకం సందర్భంగా ఉరుకుంద, ఓబులాపురం, తిమ్మాపురం గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇంట్లోనూ పిండి వంటలు చేసి బంధువుల ను ఆహ్వానించారు. ఆడపడుచులకు ఒడిబియ్యం పోశారు. సుమారు వెయ్యి మంది మహిళలు కలశాలతో ఊరేగింపుగా వచ్చి క్షేత్రంలో పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

హెలికాప్టర్‌తో పూలవర్షం : కుంభాభిషేకంలో పుణ్యక్షేత్రంపై హెలికాప్టర్ ద్వారా పూలవర్షం కురిపించారు. ఈ సుందరమైన దృశ్యాలను భక్తులు చూసి ఆనందంతో పరవశించి పోయారు. సిఐ అశోక్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. దేవాలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, గురు ప్రసాద్, సహాయ కమిషనర్లు ఆంజనేయులు, పాండు రంగారెడ్డి, పర్యవేక్షకులు వెంకటేష్, మల్లికార్జున, ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, ఉప ప్రధాన అర్చకులు మహాదేవ, ముఖ్య అర్చకులు నాగరాజు, మల్లయ్య, శివన్న, ఈరన్న, అర్చకులు లోక రాజ్ పాల్గొన్నారు.

పాల్గొన్న పీఠాధిపతులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు

బంగారు విగ్రహాన్ని అందజేస్తున్న బాలనాగిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి

అక్రమ మద్యంపై ఉక్కు పాదం

- ఎక్సైజ్ సిఐ సైదుల్

ప్రజాశక్తి - ఆదోని

పొరుగు రాష్ట్రాల మద్యాన్ని తరలించినా, విక్రయించినా అలాంటి వారిపై ఉక్కు పాదం మోపుతామని ఎక్సైజ్ ప్రొహిబిషన్ సిఐ సైదుల్ హెచ్చరించారు. సోమవారం స్వాధీనం చేసుకున్న మద్యాన్ని, నిందితులను, అందుకు ఉపయోగించిన వాహనాన్ని ఆదోనిలోని స్టేషన్‌లో మీడియా ముందు ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలోని సింధనూరు, సిరుగుప్ప ప్రాంతాల నుంచి మద్యాన్ని రవాణా చేసే వారి పట్ల నిఘా కట్టుదిట్టం చేశామని తెలిపారు. అలాంటి వారి సమాచారం తమ వద్ద ఉందని, వారి కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని సింధనూరు నుంచి పెద్దహరివాణం మీదుగా వాహనంలో మద్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. తెల్లవారుజామున కాపుకాచి ఆదోని మండలం ఆరేకల్ గ్రామ సమీపంలో గురుకుల పాఠశాల రోడ్డులో (ఎపి 39 టియు 7496) బొలేరో వాహనాన్ని ఆపి, తనిఖీ చేయగా వాహనంలో 50 బాక్సుల్లో ఒరిజినల్ ఛాయిస్ 90 మిల్లీలీటర్ల టెట్రా ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. నిందితులు ఆస్పరి మండలం కైరుప్పల గ్రామానికి చెందిన మహీంద్రా, సుధీర్ కుమార్‌గా గుర్తించామన్నారు. నిందితుడు మహేంద్ర వాహనం డ్రైవర్‌గా ఉంటూ రెండేళ్లుగా కర్ణాటక నుంచి మద్యాన్ని తరలిస్తూ నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు తెలిసిందని అన్నారు. మహేంద్రపై ఆస్పరి పోలీసు స్టేషన్‌లో పలు కేసులు ఉన్నట్లు విచారణలో తేలిందన్నారు. కర్ణాటక ప్రాంతంలో తక్కువ ధరకు కొని చుట్టుపక్కల ములుగుందం, అగ్రహారం తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిసిందని తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ మార్కెట్‌లో రూ.4 లక్షలు ఉంటుందని చెప్పారు. మద్యాన్ని, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. ప్రధాన నిందితుడు మహేంద్రతో పాటు అతని సహాయకునిగా ఉన్న సుధీర్ కుమార్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు. ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య ఉన్నారు.

స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న సిఐ

5న నిరసన ర్యాలీ : కార్మిక సంఘాలు

కార్మికుల ఆధ్వర్యంలో

ప్రజాశక్తి - ఆలూరు

కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లకు కుదించి అమలు చేయబోతున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 5న నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సిఐటియు, ఎఐటియుసి జిల్లా నాయకులు కెపి.నారాయణ స్వామి, కె.భూపేష్ తెలిపారు. సోమవారం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా కార్మిక సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. వివిధ కార్మిక వర్గాలు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, పార్లమెంట్‌లో ఆమోదించుకొని ఎప్పుడైనా అమలు చేస్తామని సాంకేతాలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. 5న దేశ వ్యాప్త నిరసనలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐఎన్‌టియుసి నాయకులు పూల రామాంజినేయులు, సిఐటియు నాయకులు కృష్ణ, శేఖర్, ఎఐటియుసి నాయకులు రంగన్న, చాపల గోపాల్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు**లోని సుందరయ్య భవన్‌లో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, రైతు సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు బి.రాముడు, బి.విజయేంద్ర, కె.ప్రసాద్, రైతుసంఘం నాయకులు ఎం.అబ్దుల్లా మాట్లాడారు. నాయకులు బి.రాజు, ఎం.గిరి బాబు, పి.రాజు, యు.రమేష్, లక్ష్మీ నరసయ్య, కె.కృష్ణ, రామప్ప, ఏసన్న పాల్గొన్నారు.

ఆలూరులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు నారాయణ స్వామి

ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న రాముడు

రెవెన్యూ అధికారుల నిర్వాకం

- రికార్డుల్లో అనుభవదారులుగా మా పేర్లు చేర్చండి

- రైతుల ఆందోళన

వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ప్రజాశక్తి - మంత్రాలయం

రెవెన్యూ అధికారుల నిర్వాకం వల్ల రెవెన్యూ రికార్డుల్లో అనుభవదారులుగా తమ పేర్లకు బదులుగా శ్రీరాఘవేంద్రస్వామి మఠం పేరుతో ఉందని, అనుభవదారులుగా తమ పేర్లను చేర్చాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రాఘవేంద్ర సర్కిల్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా భూముల అనుభవదారులు కామాటి రాఘన్న, వనికె నాగరాజు, వనికె గురురాజ, వీరయ్య శెట్టి మాట్లాడారు. గత వందేళ్లకు పైగా తమ పెద్దల వల్ల సంక్రమించిన భూములను సాగు చేసుకుంటున్న తమకు రెవెన్యూ అధికారుల నిర్వాకం వల్ల అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీమఠం యాజమాన్యంతో, తహశీల్దార్‌తో విఆర్‌ఒలు కుమ్మక్కయి ఆన్‌లైన్‌లో అనుభవదారులుగా ఉన్న తమ పేర్లను తొలగించారని తెలిపారు. శ్రీరాఘవేంద్రస్వామి మఠం పేరును పెట్టి తమకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఇందుకు కారణమైన తహశీల్దార్‌ను, విఆర్‌ఒను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో రీ సర్వే జరిగితే తమ పరిస్థితి ఏమిటని, రెవెన్యూ రికార్డుల ఆధారంగా శ్రీరాఘవేంద్రస్వామి మఠం పేరుతోనే రావచ్చని తెలిపారు. వెంటనే రికార్డుల్లో తమ పేర్లను అనుభవదారులుగా చేర్చాలని కోరారు. లేకపోతే భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ ఎస్.రవికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ... ఇందులో తమ ప్రమేయం లేదని, మళ్లీ ఒకసారి రికార్డులు చూసుకోవాలని తెలిపారు. అలాంటిది జరిగితే తమనే బాధ్యులను చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చని, వారికి తమ సంజాయిషీ ఇచ్చుకుంటామని తెలిపారు. హండే హనుమంతు, ఎంపిటిసి ఎంబి.వెంకటేష్, గణేకంటి రఘు, గణేకంటి రామకృష్ణ, మద్రి ఏబు, కయ్యూన్ రాజు, అబ్రహాం, ఎం.రాజు పాల్గొన్నారు.

కంది విక్రయానికి పేర్లు నమోదు చేసుకోవాలి

- ఎఒ హేమలత

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని వివిధ గ్రామాల్లో కంది పంటను విక్రయించదల్చుకున్న రైతులు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించుకోవచ్చని ఎఒ జి.హేమలత తెలిపారు. సోమవారం గోనెగండ్లలోని రైతు సేవా కేంద్రం వద్ద డిసిఎంఎస్ సంస్థ కంది కొనుగోలు కేంద్రాన్ని స్థానిక రైతులు, టిడిపి మండల నాయకులతో కలిసి ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కంది పండించిన రైతులందరూ ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న వివరాల మేరకు పంటను డిసిఎంఎస్ కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోవచ్చని తెలిపారు. కంది క్వింటా కనీస మద్దతు ధర రూ.7,550ను కొనుగోలు సంస్థ చెల్లిస్తుందన్నారు. డబ్బులు కూడా ఇబ్బంది లేకుండా వారం నుంచి పది రోజుల్లోపు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. సమీప రైతు సేవా కేంద్రాల్లో రైతులు వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న వివరాల ప్రకారం ఈనెల 11 నుంచి పూర్తిస్థాయిలో కంది కొనుగోళ్లు ప్రారంభమవుతాయని తెలిపారు. డిసిఎంఎస్ గోనెగండ్ల ఇన్‌ఛార్జీ సత్యనారాయణ, సర్పంచి హైమావతి, తుంగభద్ర ప్రాజెక్టు వైస్ ఛైర్మన్ అచ్చుగట్ల హుస్సేన్, టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, తిరుపతయ్య నాయుడు, రంగస్వామి నాయుడు, మాజీ సర్పంచి రంగముని, పూజారి చంద్రశేఖర్, రమేష్ నాయుడు, బిజెపి నాయకులు మునిస్వామి గౌడ్, మహేళ రహంతుల్లా, పూజారి లక్ష్మీకాంత్, మునిస్వామి పాల్గొన్నారు.

శ్మశాన వాటిక కోసం ఆందోళన

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహల్లి గ్రామంలో శ్మశాన వాటిక లేక దళితులు ఇళ్ల ముందు మృతదేహాలను ఖననం చేస్తున్నారని జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెట్నిహల్లి గ్రామ సర్వే నెంబర్ 113లో 1.50 ఎకరాల్లో దళితుల ఇళ్ల ముందు శ్మశాన వాటికను రద్దు చేయాలని కోరారు. సర్వే నెంబర్ 125, 126లో 3.54 ఎకరాల్లో శ్మశాన భూమిని పెద్ద పంపయ్య, పెద్ద బసన్న గౌడ్, తెలుగు భీమయ్య ఆక్రమించుకున్నారని తెలిపారు. వారిని ఖాళీ చేయించి రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గర్జి హనుమన్న, జిల్లా కార్యదర్శి రత్నం, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ సంగటి యోహాను, మండల నాయకులు అజయ్, అంజినయ్య, రాజు, ఈరన్న, గ్రామస్తులు రామారావు, మల్లయ్య, తిక్కయ్య, ఏసేపు, చంద్రయ్య, రాజు, నరసింహులు, మారెప్ప, ప్రసాద్, ముని, చంద్రశేఖర్, అబ్రహాం, టి.రవి కుమార్, యాకోబు, పెద్ద తిక్కయ్య, లాజర్, రాములు, దావీదు, రామన్న, ఖాసీం, తిక్కయ్య, యోహాను, బాబు, ప్రకాష్, ఏసు, దేవరాజు, నరసింహులు, డేవిడ్, జాన్, నరసన్న, విజయ్, శివ, విల్సన్ పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి : ఎస్‌ఎఫ్ఐ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎస్ఎఫ్ఐ 48వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. సోమవారం ఎస్ఎంఎల్ డిగ్రీ కళాశాలలో గోడపత్రికలు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడారు. ఈనెల 15న ఆదోనిలో 48వ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, అక్షరాస్యతలో జిల్లా వెనుకబాటుకు గురవుతోందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో విద్యాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. జిఒ 77ను రద్దు చేసి ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, ప్రతి మండల కేంద్రంలోనూ పోస్ట్ మెట్రిక్, ప్రీమెట్రిక్ హాస్టల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కోడుమూరు, మంత్రాలయంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను నిర్మించాలని, ఆదోనిలో మెడికల్ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్ కుమార్, డ్యానీ, నరేంద్ర పాల్గొన్నారు.

గోడపత్రికలు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

అబాకస్ పోటీల్లో నేషనల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని

జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో నేషనల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని నేషనల్ విద్యాసంస్థల కరస్పాండెంట్ జి.గోపాల్ రెడ్డి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం నేషనల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు సత్యశ్రీ, డైరెక్టర్ విజయకుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైసింగ్ నాలెడ్జి ఎడ్యుటెక్ సొల్యూషన్స్ వారి ఆధ్వర్యంలో స్థానిక అమరావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం జిల్లాస్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ పోటీల్లో దాదాపు 20 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. అందులో నేషనల్ హైస్కూల్ విద్యార్థులు లక్షిత 1వ తరగతి, వివేక్ 4వ తరగతి విద్యార్థులు ప్రతిభ కనబరిచి మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు మాలతి, కుమారి, అంజనా, స్వరాజ్, సాయి, నిఖితను అభినందించారు. అబాకస్, వేదిక్ మ్యాథ్స్ ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి

శ్రీమఠం నుంచి ఆక్రమణలు తొలగించాలి

- గణేకంటి రఘు

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీరాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో జరిగిన ఆక్రమణలను తొలగించాలని గణేకంటి రఘు కోరారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ ఎస్.రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంచాల గ్రామ పరిధిలో గల సర్వే నెంబరు 54లో గల 1.46 ఎకరాల్లో 50 సెంట్ల స్థలాన్ని ఆక్రమించి బ్యాంక్ ఆఫ్ బరోడా, కర్ణాటక బ్యాంకులకు భవనాలు నిర్మించి అద్దెను వసూలు చేస్తున్నారని తెలిపారు. దీని ద్వారా ఎల్ఎఫ్ రోడ్డు కుచించుకు పోయిందని చెప్పారు. ప్రభుత్వ అనుమతి లేకుండా సర్వే నెంబరు 1లో బృందావన గార్డెన్ గెస్ట్‌హౌస్, పంచముఖి దర్శన్ రూముల సముదాయం, దాస సాహిత్య అకాడమీ భవనం, సర్వజ్ఞ మందిరం, వ్యాస మందిరం, రంగసభాంగనం వంటి భవనాలను నిర్మించి లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై శ్రీమఠం యాజమాన్యం, ప్రభుత్వం నుంచి లీజుకు తీసుకున్నట్లు చెబుతున్నారని, దీనిపై విచారణ జరపాలని కోరారు. అసలు లీజు అనుమతి ఉందా..?, ఎవరు ఇచ్చారు..?, నదీ పోరంబోకు స్థలానికి ఎంత లీజు ఫిక్స్ చేశారు..?, చట్టవిరుద్ధంగా నదీ పోరంబోకు భూమిని ఎన్ని ఏళ్లకు లీజు ఇచ్చారనే అంశంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 40 అడుగుల రోడ్డులో కారిడార్ నిర్మించడం వల్ల 30 అడుగులకు చేరిందని చెప్పారు. ఆక్రమణలు తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని, వెంటనే చర్యలు తీసుకొని ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న గణేకంటి రఘు

ఎపిఒ రాజు నాయక్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ ఎపిఒగా రాజు నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఎపిఒ కృష్ణమూర్తి ఆదోనికి బదిలీ కావడంతో కొన్ని రోజులపాటు ప్లాంటేషన్ అధికారి రత్నం ఇన్‌ఛార్జీ ఎపిఒగా బాధ్యతలు చేపట్టారు. జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు వెల్దుర్తి మండలం నుంచి రాజునాయక్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం పనులు కల్పించి వలసల నివారణకు కృషి చేస్తానన్నారు.

అనారోగ్య సమస్యతో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - మంత్రాలయం

వసంత్ (ఫైల్)

మంత్రాలయంలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో యువకుడు చాకలి వసంత్ (32) అనారోగ్య సమస్యతో బాధపడుడూ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. చాకలి వసంత్ గత ఆరు నెలలుగా పైల్స్ నొప్పి, కడుపు నొప్పి తాళలేక ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. మృతుని భార్య హేమావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు చెప్పారు. హెడ్ కానిస్టేబుల్ ఎంవి.రమణ ఆధ్వర్యంలో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చిప్పగిరిలో ప్రజా పరిష్కార వేదిక

ప్రజాశక్తి - చిప్పగిరి

కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్ నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో సోమవారం చిప్పగిరి మండల కార్యాలయం నుంచి ఎంపిడిఒ అల్లా బకాష్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఇఒఆర్‌డి బాలన్న పాల్గొని మాట్లాడారు. ప్రజా పరిష్కార వేదికలో వచ్చిన దరఖాస్తులను ఒక నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు అధికారులు కృషి చేస్తారన్నారు. ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులతో సమాచారం తెలుసుకొని పరిష్కరిస్తారన్నారు. ప్రజా పరిష్కార వేదికను సమస్యలు ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఎంఇఒ సావిత్రమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన పాల్గొన్నారు.

'రాంజల చెరువులో వ్యర్థాలు తొలగించండి'

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే రాంజల చెరువులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని మానవ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షులు సురేష్ కుమార్ కోరారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాంజల చెరువును పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడారు. గత కొన్ని నెలల క్రితం మున్సిపల్ అధికారులు చెరువును శుభ్రం చేసినా, కొంతమంది చెరువులో వ్యర్థాలను వేయడంతో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు పేరుకుపోయాయని తెలిపారు. చెరువును శుభ్రపరచాలని, అక్కడ బోర్డును కూడా ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రజలు చెరువులో వ్యర్థాలను పడేసి తాగునీటిని కలుషితం చేయవద్దని తెలిపారు. సంఘం జిల్లా కార్యదర్శి శంకర్, మీడియా కోఆర్డినేటర్ కన్నా, రాజశేఖర్, సభ్యులు కిరణ్, రమేష్, మహేష్, ఉసేని ఉన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కావలెను

A.P. Transco, Uppalapadu 220 KVSWS Sub-Station నందు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేయుటకు క్రింద కనబరిచిన Workers కావలెను.

Highly Skilled

BC-D : Qualification :

Diploma - Electrical Skilled.

BC-A(W): Qualification :ITI - Electrical

Age : 18 to 35 Years below.

పై తెలిపిన Postలకు Shift Duties చేయుటకు అభ్యర్థులు కావలెను. అర్హత వున్నవారు 15 రోజులలోపు తమ Bio-Dataతో పాటు SSC, Diploma, ITI, Caste Certificate మరియు ఆధార్‌కార్డులను జత చేసి ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

The Circle Inspector of APTS
Office of the SE/OP/APSPDCL/
Kurnool -518003. A.P.

జి.భాస్కర్ రెడ్డి,
కాంట్రాక్టర్, సెల్: 9703732540.

IN THE COURT OF THE CIVIL JUDGE
(SENIOR DIVISION) : ADONI
I.P.NO.8/2023

Between
Avula Chandra sekhar. ...Petitioner
V/s
Uppari Madhu Krishna & Others. ...Respondents

GENERAL NOTICE

Whereas the above named petitioner filed petition under section u/s x(2) R/w 13 of provincial insolvency act to declare the petitioner as insolvent. Hence any body wants any objection with regard to the above petition are hereby oppear before this court on 24.02.2025 at 10.30 AM And file objections if any otherwise the petition will be decided on merits

(BY COURT ORDER)
A.MADHAVAKRISHNAIAH
BA BL
Advocte, adoni.
Cell No.9440971360